ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప జిల్లా వార్తలు
5
శుక్రవారం 17 జనవరి 2025

మైదుకూరులో సభాస్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఇన్‌చార్జ్ ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తదితరులు



సీఎం పర్యటనను విజయవంతం చేయండి

● కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

కడప కలెక్టరేట్/మైదుకూరు రూరల్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 18వ తేదీ శనివారం మైదుకూరులో చేపట్టిన పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లపై జేసీ అదితిసింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడులతో కలసి జిల్లా అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీఎం పర్యటనకు సంబంధించి అధికారికంగా మినిట్ టు మినిట్ అందాల్సి ఉందన్నారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రణాళికా బద్ధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రోటోకాల్ ప్రకారం అన్ని ఏర్పాట్లు చేయడంతో పాటు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో ఓబులమ్మ, ఆర్డీవోలు జాన్ ఇర్విన్, సాయిశ్రీ, చంద్రమోహన్, కడప కమిషనర్ మనోజ్‌రెడ్డి, ఇన్‌చార్జి సీపీవో హజరత్తయ్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఏర్పాట్ల పరిశీలన

స్వచ్ఛాంధ్ర ప్రదేశ్‌లో భాగంగా సీఎం చంద్రబాబునాయుడు మైదుకూరు రానున్న నేపథ్యంలో ఇక్కడ చేపట్టిన ఏర్పాట్లను గురువారం కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, జిల్లా ఇన్‌చార్జ్ ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, సీఎం ప్రోగ్రాం కమిటీ చైర్మన్ వెంకటేశ్, ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, జిల్లా ఉన్నతాధికారులు పరిశీలించారు. మైదుకూరు పట్టణం అంతా క్లీన్‌గా ఉంచేందుకు మున్సిపాలిటీ సిబ్బంది పనులు చురుగ్గా చేస్తున్నారు. సభాస్థలం అయిన జిల్లా పరిషత్ హైస్కూల్ గ్రౌండ్‌ను చదును చేస్తున్నారు. పోలీసులు జాగిలాలతో పట్టణం అంతా పరిశీలించారు. కోర్టు వద్ద హెలీప్యాడ్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. సమయం కేవలం రెండు రోజులు మాత్రమే ఉండడంతో జిల్లా అధికార యంత్రాంగం అంతా మైదుకూరులోనే ఉంటూ పనులను పరిశీలిస్తున్నారు. కార్యక్రమంలో డీఎస్పీ రాజేంద్రప్రసాద్, సీఐలు హసం, శివశంకర్, పార్టీ పట్టణ అధ్యక్షుడు దాసరిబాబు తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవానికి పక్కాగా ఏర్పాట్లు చేయాలి : కలెక్టర్

కడప కలెక్టరేట్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవ కార్యక్రమానికి పక్కా ప్రణాళికతో ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లపై జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడుతో కలసి అన్ని శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 26వ తేదీన పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే వేడుకల్లో జెండా వందన కార్యక్రమం వేదికను అందంగా అలంకరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రజాప్రతినిధులు, స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులు, ఇతర అతిథులను వేడుకలకు ప్రత్యేకంగా ఆహ్వానించాలని అన్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమం, అభివృద్ధికి సంబంధించి జిల్లాలో సాధించిన ప్రగతిని చాటి చెప్పేలా శకటాలు, ఎగ్జిబిషన్ స్టాళ్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆయా శాఖల్లో విశిష్ట సేవలు అందించిన ఉత్తమ అధికారులు, సిబ్బంది, ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేయడానికి జాబితాను నిర్ణీత గడువులోగా ఇవ్వాలన్నారు.

పందెం రాయుళ్ల పండుగగా సంక్రాంతి

● తులసిరెడ్డి ఎద్దేవా

వేంపల్లె, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సంతోషంగా జరుపుకోవాల్సిన సంక్రాంతి పండుగ చంద్రబాబు పాలనలో జూదగాళ్లు, తాగుబోతుల, పందెం రాయుళ్ల పండుగగా తయారుకావడం దురదృష్టకరమని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి ఆరోపించారు. గతంలో కొన్ని జిల్లాలో అక్కడక్కడ కోడిపందేల బరులు ఏర్పాటుచేసేవారని.. కానీ ఈసారి అన్ని జిల్లాలో దాదాపు అన్ని మండలాల్లో బరులు ఏర్పాటుచేశారన్నారు. బరుల వద్ద మద్యం ఏరులై పారిందని, బార్లు, బెల్టుషాపులు వెలిశాయన్నారు. మూడుముక్కలాట, మంగాత్తె, జూదం విచ్చలవిడిగా జరిగాయన్నారు. కొన్నిచోట్ల అశ్లీల నృత్య ప్రదర్శనలు జరిగాయన్నారు. బరులు టీడీపీ కూటమి నాయకుల ఆదాయ వనరులుగా మారాయని ఇదేనా చంద్రబాబు ఆశించిన స్వర్ణాంధ్ర అని ప్రశ్నించారు.

కడప ఆర్టీసీ బస్టాండులో రద్దీ



కిటకిటలాడిన కడప బస్టాండ్

కడప మారుతీనగర్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా ఇతర ప్రాంతాల నుంచి జిల్లాకు వచ్చిన ప్రజలంతా తిరుగు ప్రయాణం కావడంతో కడప ఆర్టీసీ బస్టాండ్ ప్రయాణికులతో కిటకిటలాడింది. బస్టాండుకు బస్సు రాగానే సీట్ల కోసం బ్యాగులు వేసేవారు కొందరైతే.. మరికొందరు ఏకంగా చిన్నపిల్లలను కిటికీల్లోనించి లోపలికి దింపి సీట్లలో కూర్చోబెట్టారు. కుటుంబ సభ్యులతో ప్రయాణం చేసేవారి అవస్థలు అన్నీఇన్నీ కావన్నట్లుగా మారింది. ప్రధానంగా హైదరాబాద్, విజయవాడ, బెంగళూరు, చెన్నై, తిరుపతి, నెల్లూరు తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంది. అందుకు అనుగుణంగా కడప రీజియన్ పరిధి నుంచి 270 బస్సులను అధికారులు సిద్ధం చేశారు. ఈ బస్సులు ఈనెల 19వ తేదీ ఆదివారం వరకూ సాధారణ చార్జీలతో నడుపనున్నారు. వీటికి అడ్వాన్స్ రిజర్వేషన్ సౌకర్యం కూడా కల్పించారు. ఆ మేరకు కడప రీజియన్ పరిధిలోని కడప డిపోతో పాటుగా మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల డిపోల నుంచి కూడా బస్సులు సిద్ధం చేశారు. ఇందులో హైదరాబాదుకు 100 బస్సులు, బెంగళూరుకు 70, విజయవాడకు 25, చెన్నైకి 15, ఇతర ప్రాంతాలకు మరో 60 బస్సులు మొత్తంగా 270 బస్సులను సిద్ధం చేశారు. అయితే ఈ బస్సులు ప్రయాణికులకు ఏమాత్రం సరిపోలేదు.



ఇసుక టెండర్లలో.. బీటెక్ రవి అనుచరుల హంగామా

పోలీసులతో వాగ్వాదం



జిల్లాలో ఇసుక తవ్వకాల కోసం కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన టెండర్లలో పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి అనుచరులు హంగామా సృష్టించారు. పులివెందుల, చక్రాయపేట, వేముల ప్రాంతాల నుంచి భారీగా బీటెక్ రవి అనుచరులు కలెక్టరేట్ డీడీ కార్యాలయం వద్దకు చేరుకుని టెండర్లు వేసేందుకు వెళ్లే వారిని అడ్డుకున్నారు. ఇది తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. ఒకానొక సమయంలో కూటమి నేతలు అరుచుకుంటూ కేకలు వేసుకుంటూ బాహాబాహీకి సిద్ధమయ్యారు. ఇంతలో వన్‌టౌన్ సీఐ రామక్రిష్ణ ఆధ్వర్యంలో పోలీసులు వచ్చి గుంపును చెదరగొట్టారు.

● గనుల శాఖ కార్యాలయంలోకి ఎవ్వరినీ వెళ్లనివ్వకుండా..
● కార్యాలయానికి తలుపు వేసి అడ్డుకున్న వైనం
● కూటమి నేతల మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు
● పోలీసుల రాకతో చివరికి టెండర్లు వేసేందుకు అనుమతి

(కడప-ఆంధ్రజ్యోతి): పులివెందుల నియోజకవర్గంలోని చక్రాయపేట మండలం గండికొవ్వూరు, రాజంపేట నియోజకవర్గం సిద్దవటం మండలంలోని గుండ్లమూల ఇసుక రీచ్‌లలో ఇసుక తవ్వేందుకు భూగర్భగనుల శాఖ ఈ నెల 4వ తేదీన ఆఫ్‌లైన్‌లో టెండర్లను ఆహ్వానించింది. చివరి తేది గురువారం అని నిర్ణయించింది. దీంతో టెండరులో పాల్గొనేందుకు పలువురు కాంట్రాక్టర్లు గురువారం కలెక్టరేట్‌లోని భూగర్భగనులశాఖ కార్యాలయంలో టెండరు పెట్టిన బాక్సువద్దకు చేరుకున్నారు. అయితే ఉదయం నుంచే బీటెక్ రవి అనుచరులు కార్యాలయం వద్ద మకాం వేశారు. గడువు ముగుస్తుండడంతో టెండర్లు వేసేందుకు వస్తున్న వారిని వీరు అడ్డుకున్నారు. కొంతమంది కార్యాలయానికి గడియ వేసుకుని లోపల కూర్చున్నారు. బయటి నుంచి టెండరు వేసేందుకు లోపలికి పోనివ్వకుండా అడ్డుకున్నారు.

మీడియా సిబ్బందిపైనా దౌర్జన్యం

టెండర్లు వేసేందుకు కడప, కమలాపురం ఎమ్మెల్యేలు ఆర్.మాధవి, పుత్తా కృష్ణచైతన్యరెడ్డి అనుచరులు, సిద్దవటానికి చెందిన జనసేన నేత అతికారి వెంకటసుబ్బయ్య వచ్చారు. వీరందరినీ బీటెక్ రవి అనుచరులు లోపలికి పోనీకుండా అడ్డుకున్నారు. దీంతో ఉద్రిక్తతగా మారింది. ఆ దృశ్యాలను వీడియోలు తీస్తున్న మీడియా సిబ్బందిపై కూడా దౌర్జన్యానికి దిగారు. వీడియో డెలిట్ చేయమని బెదిరించడంతో మీడియా సిబ్బంది పక్కనే ఉన్న ఐఎన్‌బీ కార్యాలయానికి వెళ్లి తలదాచుకున్నారు. పెద్దగా కేకలు అరుపులు వేసుకుంటుండడంతో వన్‌టౌన్ సీఐకి సమాచారం అందడంతో ఆయన హుటాహుటిన అక్కడకు వచ్చి గుంపును చెదరగొట్టారు. వీరిని పంపించాక కార్యాలయం తలుపులు తెరిచి టెండర్లు వేసేందుకు మార్గం సుగమం చేశారు. సాయంత్రం 5.30 వరకు టెండర్లు వేయించి అనంతరం బాక్సులు సీజ్ చేసి కలెక్టరేట్‌లోకి తరలించారు. గండికొవ్వూరు రీచ్‌కు రెండు టెండర్లు, గుండ్లమూల రీచ్‌కు 14 టెండర్లు వచ్చాయి.

గనులశాఖ నిర్లక్ష్యం

కూటమి నేతల మధ్యనే ఇసుక టెండర్ల కోసం గొడవ జరగడం చూసి ఔరా అంటూ పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. సాక్షాత్తు కలెక్టరేట్ ప్రాంగణంలోనే గొడవలు, కేకలు అరుపులు వేయడంతో చుట్టుపక్కల అధికారులు ఏం జరుగుతుందోనని భయంభయంగా గడిపారు. పోలీసులు రాకుంటే పరిస్థితి చేయి దాటిపోయేది. వాస్తవంగా అయితే ఈ రెండు రీచ్‌లకు సంబంధించి కోర్టులో కేసులున్నాయి. అయినప్పటికీ గనులశాఖ అధికారులు టెండర్లు పిలవడం గమనార్హం. ఇక బీటెక్ రవి అనుచరులు మైనింగ్ కార్యాలయాన్నే ఆక్రమించి బయటి నుంచి ఎవరినీ రానీయకుండా అడ్డుకోవడం చూసి కూటమి నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆఫ్‌లైనులో టెండర్లు జరిగితే కనీసం భూగర్భశాఖ అధికారులు పోలీసులను బందోబస్తు కోరకపోవడం గమనార్హం. గనులశాఖ అధికారుల నిర్లక్ష్యంపై పలువురు కాంట్రాక్టర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



బీటెక్ రవి అనుచరులు లోపలనుంచి గనులశాఖ కార్యాలయం తలుపులు వేసేయడంతో టెండరు వేసేందుకు వచ్చిన వారు బయట నిల్చున్న దృశ్యం

కట్టలు తెంచుకున్న ప్రజాగ్రహం

● ఏడు నెలలుగా రేషన్ ఇవ్వలేదంటూ సచివాలయానికి తాళం
● రెండేళ్లుగా నీటి సమస్య పరిష్కరించలేదంటూ రోడ్డుపై బైఠాయింపు



నల్లపురెడ్డిపల్లె గ్రామంలో సచివాలయానికి తాళం వేసిన ప్రజలు



నీటి సమస్య తీర్చాలంటూ రోడ్డుపై బైఠాయించిన సుంకులమ్మపేట ప్రజలు

పులివెందుల రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): నెల కాదు రెండు నెలలు కాదు.. ఏకంగా ఏడు నెలల నుంచి తమకు రేషన్ బియ్యం ఇవ్వలేదు, కంది బేడలు అమ్ముకొన్నారు అంటూ సచివాలయానికి తాళం వేసి తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. అలాగే రెండేళ్ల నుంచి నీటి సమస్య ఉందని చెప్పినా అధికారులు పట్టీనట్టనట్లు వ్యవహరిస్తున్నారంటూ రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. మూడు గంటల పాటు సాగిన ఈ నిరసన అధికారుల హామీతో సద్దుమణిగింది.

పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లెలోని సుంకులమ్మపేట కాలనీలో దాదాపు 150 కుటుంబాలు ఉన్నాయి. గత డీలర్ నుంచి ప్రస్తుత డీలర్ వరకు తమకు కేటాయించిన బియ్యం, కందిబేడలు అమ్ముకుంటున్నారని వీరు ఆరోపించారు. అడిగితే మీ కార్డులన్నీ బ్లాక్ అయ్యాయని అంటున్నారని తెలిపారు. దీనిపై అధికారులకు తెలియజేసినా స్పందన లేదన్నారు. ప్రజాప్రతినిధులను కలిసినా పట్టించుకోలేదన్నారు. దీంతో సచివాలయానికి తాళం వేశామన్నారు. అనంతరం ఆర్ఐ షెక్షావలి రావడంతో ప్రజలు చుట్టుముట్టారు. సమస్యను ఇంతవరకు ఎందుకు తెచ్చావని ఆర్ఐ ప్రశ్నించగా.. డీలర్ మస్తాన్ మాట్లాడుతూ బియ్యం కేటాయింపులు లేవని, ఇలాగైతే తాను రాజీనామా చేస్తానని అన్నారు. సాయంత్రానికంతా బియ్యం తెప్పించి పంపిణీ చేస్తామని ఆర్ఐ చెప్పడంతో ప్రజలు అక్కడ నుంచి వెళ్లిపోయారు. కాసేపటికే.. సుంకులమ్మపేట వాసులు రోడ్డుపై బైఠాయించారు. రెండేళ్లుగా తాము తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నామని అధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలిపినా ప్రయోజనం లేదన్నారు. దాదాపు రెండు గంటల పాటు తీవ్ర ట్రాఫిక్ నెలకొంది. ఎస్ఐ విష్ణునారాయణ అక్కడకు చేరుకుని సంబంధిత అధికారులు వస్తారని ప్రజలకు సర్దిచెప్పి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూశారు. అనంతరం వచ్చిన ఎంపీడీఓ రామాంజనేయరెడ్డితో డిష్ వెంకటరెడ్డి, విశ్వనాథరెడ్డి, మల్లికార్జునరెడ్డి, ఓబులేసు తదితర గ్రామస్థులు మాట్లాడారు. రెండేళ్ల నుంచి సమస్యను చెబుతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోలేదన్నారు. శుక్రవానికి మరమ్మతులు చేస్తామని ఎంపీడీఓ తెలుపగా తమకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు పట్టుబట్టారు. పది రోజుల్లోగా హైకెపాసిటీ మోటార్ ఏర్పాటుచేస్తామని చెప్పడంతో ప్రజలు శాంతించారు.

ఉత్కంఠగా బండలాగుడు పోటీలు



ప్రథమ స్థానంలో నిలిచిన ఎడ్లకు బహుమతిగా అందజేసిన రాయల్‌ఎన్‌ఫీల్డ్ వాహనంపై యజమాని సుంకి సురేంద్రారెడ్డి

వివరాలు.. 7లో

భర్త మృతదేహంతో నిరసన

● న్యాయం చేయాలని వేడుకోలు

7



బాధితులతో మాట్లాడుతున్న ఎస్ఐ చిన్నపెద్దయ్య

రాయచోటి టు బెంగళూరు

రేషన్ బియ్యం అక్రమ తరలింపునకు జిల్లా కేంద్రం రాయచోటి అడ్డాగా మారుతోంది. రాయచోటి నుంచి బెంగళూరుకు రేషన్‌బియ్యం టన్నుల కొద్దీ అక్రమంగా తరలిపోతోంది. కొందరు జిల్లా రైస్ మిల్లుల సంఘం నాయకులే ఈ బియ్యం తరలింపులో ప్రధాన భూమిక పోషిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అక్రమార్కులు ఇక్కడ కిలో రూ.10కి కొని.. బెంగళూరులో రూ.40కి తక్కువ కాకుండా అమ్ముకుంటూ.. నెలనెలా కోట్ల రూపాయలు అక్రమంగా జేబులో వేసుకుంటున్నారు. ఈ అక్రమ చౌకబియ్యం రవాణా వ్యవహారం జిల్లా తెలుగుదేశం పార్టీ ముఖ్య ప్రజా ప్రతినిధుల మధ్య చిచ్చు పెడుతోంది.



గుర్రంకొండ పోలీసులు పట్టుకున్న రేషన్‌బియ్యం లారీ (ఫైల్)

● తరలుతున్న రేషన్ బియ్యం
● కొనేది రూ.10కి.. అమ్మేది రూ.40
● నెలకు రూ.కోట్ల ఆర్జన
● పట్టుకున్నవి కొన్ని.. తరలిపోతున్నవి ఎన్నో?
● అధికార పార్టీ నాయకుల మధ్య బియ్యం చిచ్చు

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం తరలింపులో తలలు పండిన కొందరు మిల్లుల యజమానులు, వ్యాపారులు అధికార పార్టీకి చెందిన పెద్దవాళ్ల పేరు చెప్పి దందా కొనసాగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వంలో పలువురు ఎమ్మెల్యేలే చౌకబియ్యం అక్రమ రవాణా వెనుక ఉన్నారనే ఆరోపణలు ఉండేవి. దీంతో కొందరు వైసీపీ నాయకులు దర్జాగా చౌకబియ్యాన్ని సరిహద్దులు దాటించారు. ఇప్పుడు కూడా అదే అక్రమ రవాణా జోరుగా సాగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం నెలకు సుమారు 10 ట్రిప్పులు చౌక బియ్యం జిల్లా కేంద్రం నుంచి బెంగళూరుకు తరలుతోందనే ఆరోపణలు ఉన్నాయి. ఇదే సమయంలో రెవెన్యూ, పోలీసు అధికారులు ప్రస్తుత అధికార పార్టీ నాయకుల మధ్యలో.. ఎవరి మాట వినాలో.? ఎవరి మాట వినకూడదో తెలియక.. సతమతమవుతున్నారనే ప్రచారం ఉంది.

ఇంటింటికీ తిరిగి.. కొనుగోలు చేసి

రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఉచితంగా చౌక బియ్యాన్ని పంపిణీ చేస్తోంది. ఎండీయూ వాహనదారులు ఇంటింటా కార్డుదారులకు బియ్యం పంపిణీ చేసే క్రమంలో ఎవరైనా బియ్యం వద్దంటే వాటిని కిలో రూ.10 నుంచి రూ.15కు కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. రాయచోటి పట్టణంలోని కొత్తపేట, బోస్‌నగర్, రామాపురం, పాతరాయచోటి, కొత్తపల్లె, మాసాపేట, ఎస్ఎన్ కాలనీతో పాటు ఇంకా పలు ప్రాంతాల నుంచి చౌకబియ్యాన్ని కొనుగోలు చేస్తారు. మదనపల్లె పట్టణంలో ఈశ్వరమ్మ కాలనీ, కొత్తయిండ్లు, మోతీనగర్, నీరుగట్టువారి పల్లె, తదితర ప్రాంతాలలో కూడా బియ్యాన్ని కొనుగోలు చేస్తారు. ఇంటింటికీ తిరిగి సేకరించే చిరు వ్యాపారులు.. అయిదు నుంచి పది క్వింటాళ్లు సేకరించాక బయటి వ్యాపారులకు అమ్ముతున్నారు. ఇలా కొనుగోలు చేసిన బియ్యాన్ని ఆటోలలో తరలించి తమకు అనువైన చోట నిల్వ ఉంచుకుంటారు. వీటిని బడా వ్యాపారులు కొనేసి.. తమ మిల్లుల్లో పాలీష్ పట్టి.. సన్నబియ్యంగా మార్చి బెంగళూరుకు తరలించి, కిలో రూ.40కి తక్కువ కాకుండా అమ్ముకుంటున్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట మండలాల సరిహద్దులో కర్ణాటక ఉంది. దీంతో ఇక్కడి నుంచి రేషన్ బియ్యం అక్రమ రవాణా సులువుగా మారింది. కాగా.. కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లోని రామసముద్రం మండలంలో నాలుగు, పెద్దతిప్పసముద్రం మండలంలో నాలుగు చెక్‌పోస్టులు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇవన్నీ మూతబడ్డాయి. మదనపల్లె మండలంలోని చీకలబైలు వద్ద ఉన్న చెక్‌పోస్టు పనిచేస్తోంది.

అడపాదడపా కేసులు

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటి వరకు అటు పోలీసులు, ఇటు రెవెన్యూ అధికారులు కలిసి అడపాదడపా దాడులు జరిపి చౌకబియ్యం పట్టుకుని కేసులు నమోదు చేశారు. గత నెలలో మదనపల్లె-బెంగళూరు మార్గంలోని చీకలబైలు చెక్‌పోస్టు వద్ద పది క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకుని కేసు నమోదు చేశారు.

● కలకడ మండలంలో గత నెల 9వ తేదీ బాలయ్యగారిపల్లె పంచాయతీ ఎర్రయ్యగారిపల్లె సినిమా హాల్‌కు సమీపంలోని ఓ గోడౌన్‌లో ఆర్.వెంకటరమణకు చెందిన 6 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇదే పంచాయతీ పరిధిలోని సిద్దేశ్వర ఆలయం మార్గంలోని సిమెంట్ ఇటుక ఫ్యాక్టరీ గోడౌన్‌లో మరో వ్యక్తి నిల్వ ఉంచిన 145 క్వింటాళ్లను స్వాధీనం చేసుకున్నారు.

● గత ఏడాది డిసెంబరు 8న సంబేపల్లె మండలం ఎస్.సోమవరం గ్రామం దేవళంపేట సమీపంలోని కోళ్లషెడ్డు, గోడౌన్లలో అక్రమంగా నిలువ ఉంచిన రేషన్ బియ్యం స్థావరంపై స్వయంగా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ దాడులు చేసి 209 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

● రాయచోటి పట్టణంలో ఈనెల మొదటి వారంలో లక్ష్మీ థియేటర్ వెనుకభాగంలో ఒక వ్యక్తి నుంచి 560 బస్తాల చౌక బియ్యాన్ని ఒక గదిలో నిలువ చేసి ఉండగా రాయచోటి అర్బన్ పోలీసులు స్వాధీన పర్చుకుని కేసు నమోదు చేశారు.

● ఇదే నెలలోనే రాయచోటి పట్టణం మదనపల్లె రోడ్డులోని ఓ షాదీమహల్ సమీపంలోనూ రాయచోటి అర్బన్ పోలీసులు దాడులు జరిపి 210 బస్తాల చౌకబియ్యాన్ని స్వాధీన పర్చుకుని కేసు నమోదు చేశారు.

అధికార పార్టీలో చిచ్చు

చౌకబియ్యం అక్రమ రవాణా వెనుక అన్నమయ్య జిల్లా రైస్‌మిల్లుల అసోసియేషన్‌కు చెందిన ఓ ముఖ్యనాయకుడి పాత్ర ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గత ఏడాది డిసెంబరులో కలకడ మండలంలో ఓ వ్యాపారి నిల్వ చేసిన 151 క్వింటాళ్ల చౌక బియ్యాన్ని ఇతను పోలీసులకు పట్టించాడని సమాచారం. దీనిపై సదరు వ్యాపారి ఓ ముఖ్యనాయకుడికి ఫిర్యాదు చేశాడని అంటున్నారు. అప్పటి నుంచి ఆ వ్యాపారి కాపు కాసి బుధవారం తెల్లవారుజామున బెంగళూరుకు తరలిస్తున్న బియ్యాన్ని పోలీసులకు పట్టించాడని ప్రచారం జరుగుతోంది. దీనిపై కేసు నమోదు చేయాలని ఓ ముఖ్యనాయకుడి అనుచరులు పోలీసులపై ఒత్తిడి తెచ్చారు. అయితే ఇవి చౌకబియ్యం కావు కేసు నమోదు చేయకుండా వదిలేయాలని మరో ముఖ్య నాయకుడి అనుచరులూ ఒత్తిడి తెచ్చారు. చివరకు బుధవారం సాయంత్రం 5 గంటల సమయంలో బియ్యం లోడు లారీని కేసు నమోదు చేయకుండానే పోలీసులు వదిలేశారు. ప్రస్తుతం ఈ సంఘటన జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

రెవెన్యూ దరఖాస్తులను నాణ్యతతో పరిష్కరించాలి

● అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(కలెక్టరేట్), జనవరి 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో అందిన దరఖాస్తులను అత్యంత ప్రాధాన్యతగా నాణ్యతతో పరిష్కరించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ సం బంధిత అధికారులను ఆదేశించారు. గురువారం రాయచోటి కలెక్ట రేట్ నుంచి పీజీఆర్ఎస్, రెవెన్యూ సదస్సుల దరఖాస్తుల పరిష్కారం, ఫ్రీ హోల్డ్ భూముల పరిశీలన, ప్రభుత్వ భూముల గుర్తి ంపు, పల్లె పండుగ పనుల ప్రగతి తదితర అం శాలపై డివిజన్, మండలస్థాయి అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్, రెవె న్యూ సదస్సుల్లో ప్రజల నుంచి అందిన దరఖాస్తు లను క్షేత్రస్థాయిలో తప్పనిసరి విచారణ చేప ట్టాలన్నారు. కనీసం రోజుకు ఐదు దరఖాస్తులను నాణ్యతగా పరిష్కరించాలని సూచిం చారు. అలాగే రీ సర్వేకు సంబంధించి వివరాలను అడిగి తెలుసుకుని వాటిని పీజీఆర్ఎస్‌లో వెంటనే ఆన్‌లైన్ చేసి పరిష్కరించాలన్నారు. ఈ నెల 20 నుంచి ప్రతి మండల కార్యాలయం నుంచి ఈ ఆఫీసు లోనే జిల్లా కేంద్రానికి ఫైల్స్ పంపాలని కలెక్టర్ సూచించారు. ఇందుకు తగిన విధంగా ప్రతి మండల కార్యాలయంలో ఈ ఆఫీస్‌పై తహసీ ల్దార్, సంబంధిత సిబ్బంది వెంటనే శిక్షణ పొందాలని తెలిపారు. పల్లె పండుగకు సంబంధించిన పనులన్నింటినీ ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. ఎక్కడైనా ఇంకా ప్రారంభం కాని పను లు ఉన్నాయా అని ఆరా తీశారు. పనులు పూర్తికి అవసరమైన చోట ఉపాధి హామీ ద్వారా అదనంగా నిధులు మంజూరు చేయడానికి ప్రభు త్వం చర్యలు తీసుకుంటోందని కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా సీసీ రోడ్లు, గోకులాలు, కాలువలు తదితర మంజూరైన పనులను వేగవంతంగా పూర్తి చేయా లన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్వో మధుసూదన్‌రావు, సబ్‌కలెక్టర్లు మేఘస్వరూప్, నిదియాదేవి, డ్వామా పీడీ వెంకటరత్నం, మండల స్థాయి అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి మాసోత్సవాలను విజయవంతం చేయాలి

జిల్లాలో ఈనెల 16 నుంచి ఫిబ్రవరి 15వరకు నిర్వహించే జాతీయ రహదారి మాసోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లో జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు-2025 కార్యక్ర మానికి సంబంధించిన బ్యానర్లు, బుక్‌లెట్లు బ్రోచర్లను కలెక్టర్ ఆవిష్క రించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో నిర్వహించే జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా రోడ్డు ప్రమాదాల నివార ణకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్ర మంలో ఆర్టీవో, మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఉత్కంఠగా సాగిన బండలాగుడు పోటీలు



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినం పురస్కరించు కుని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి స్వగ్రామం కామనూరులో సోమవారం జరిగిన బండలా గుడు పోటీలు ఉత్కంఠభరితంగా సాగాయి. గురువారం ఉదయం ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి, ఆయన సోదరుడు మాజీ ఎంపీపీ నం ద్యాల రాఘవరెడ్డి రాష్ట్రస్థాయి సీనియర్ కేట గిరీ విభాగం బండలాగుడు పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో ఉమ్మడి రాష్ట్రం లోని వివిధ ప్రాంతాల నుంచి 11 జతల ఎ ద్దులు పాల్గొనగా... నువ్వా, నేనా అన్నట్లు సా గిన పోరులో నంద్యాల పట్టణం పెద్దకొట్టాలు కు చెందిన బోరెడ్డి కేశవరెడ్డి, తెలంగాణలోని సూర్యాపేట, హుజూరునగర్‌కు చెందిన సుం కి సురేంద్రారెడ్డి కంబైండ్ కాడెద్దులు 25 ని మిషాల వ్యవధిలో 3,643 అడుగులు దూరా న్ని లాగి ప్రథమస్థానంలో నిలిచాయి. మైదు కూరుకు చెందిన కేవీఎస్ బుల్స్ కుర్రా వెంక టేష్‌యాదవ్ ఎద్దులు 3,260 అడుగుల దూ రాన్ని లాగి రెండో స్థానంలో, ప్రొద్దుటూరు మండలం చౌటపల్లెకు చెందిన మార్తల చం ద్ర ఓబుళరెడ్డి ఎద్దులు 3,147 అడుగులు లా గి మూడో స్థానంలో నిలిచాయి. స్థానిక వైఎంఆర్ కాలనీకి చెందిన ద్వార్శల గురివిరె డ్డి ఎద్దులు 3,208 అడుగుల దూరం లాగి నాలుగో స్థానంలో నిలవగా, గుంటూరు జి ల్లా కుంచెనపల్లికి చెందిన వులం త్రిస్నారెడ్డి కాడె 2,806 అడుగులు లాగి 5వ స్థానం దక్కించుకున్నాయి. కడప జిల్లా చౌటపల్లెకు చెందిన మార్తల చంద్ర ఓబుళరెడ్డి ఎద్దులు 2,788 అడుగులు లాగి 6వ స్థానంలో నిలిచి నట్లు నిర్వాహకులు ప్రకటించారు. విజేతలకు మొదటి బహుమతిగా రాయల్ ఇన్‌ఫీల్డ్ 350 సీసీ (బుల్లెట్), రెండో బహుమతిగా టీవీఎస్ అపాచి 160 సీసీ, మూడో బహుతి టీవీఎస్ ఫోర్ట్, 4వ బహుమతిగా టీవీఎస్ ఎక్స్‌ఎల్ 100, 5వ బహుమతిగా రూ.25వేలు, 6వ బ హుమతిగా రూ.15వేలు అందజేశారు. మిగి లిన వారికి కన్సొలేషన్ బహుమతిగా రూ.5,116 అందించారు.

రోడ్డు ప్రమాద బాధితులకు సాయం చేద్దాం : కలెక్టర్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీధర్, జేసీ అదితిసింగ్

కడప ఎడ్యుకేషన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాద బాధి తులకు సహాయం చేసి.. ప్రాణాలు కాపాడుకుందామని కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో రవాణాశాఖ ఆధ్వర్యంలో 36వ జాతీయ రవాణా భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని దారి భద్రత ప్రచారం (శ్రద్ధ వహించండ) కరపత్రాలను కలెక్టర్ ఆవిష్క రించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 36వ జాతీయ రవాణా భద్రత మాసోత్సవాలు 2025లో భాగంగా 16 నుంచి ఫిబ్రవరి 15 వరకు ప్రచార కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. రోడ్డు ప్రమాదం జరిగిన గంట (గోల్డెన్ అవర్) లోపు బాధితులకు సరైన వైద్య చికిత్స అందిస్తే ప్రాణాలు కాపాడవచ్చన్నారు. రహదారి ప్రమాదాల క్షతగాత్రులకు నిస్వార్థంగా, స్వచ్ఛందంగా సహాయం అందించి, దగ్గరలోని ఆసుపత్రికి చేర్చాలన్నారు. గుడ్ సమిరిటన్‌కు రూ.5వేలు నగదు బహుమతి, ప్రశంసాపత్రం ఇవ్వడం జరుగుతుం దన్నారు. మద్యం సేవించి వాహనం నడపరాదని, ర్యాష్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్ నేరమన్నారు. కార్యక్రమంలో జేసీ అదితిసింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, జడ్పీసీఈఓ ఓబులమ్మ, కడప, జమ్మల మడుగు, బద్వేలు ఆర్డీఓలు జాన్ ఇర్విన్, సాయిశ్రీ, చంద్రమోహన్, మున్సిపల్ కమిషనర్ మనోజ్‌రెడ్డి, ఇన్‌చార్జి సీపీఓ హజ్రతయ్య, డీటీ సీ, రవాణాశాఖ సిబ్బంది, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

భర్త మృతదేహంతో నిరసన

● న్యాయం చేయాలని వేడుకోలు



వెంకటయ్య మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు

చాపాడు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని నక్కలదిన్నె గ్రా మంలో షంద్ర యశోద తన భర్త వెంకటయ్య (35) మృతదేహాన్ని గు రువారం అదే గ్రామానికి చెందిన ఎర్రిబోయిన ప్ర సాదు ఇంటి ముందు ఉంచి తనకు న్యాయం చేయాలని వేడుకుంది. ఈనెల 15న బుధవారం వెంకటయ్య ఆ గ్రామం వద్ద ఉన్న బావిలో కాలు జారి నీళ్లలో పడి మృతి చెందాడు. యశోద ఫిర్యా దు మేరకు పోలీసులు కే సు నమోదు చేసి దర్యా ప్తు చేస్తున్నారు. ప్రొద్దు టూరు జిల్లా ఆస్పత్రిలో మృతదేహానికి గురువారం పోస్టుమార్టం నిర్వహించారు. కాగా, తన భర్త వెంకటయ్య వ్యవసా యకూలి పనులకు ప్రతి రోజూ ప్రసాదు పొలం వద్దకు వెళ్లేవా డని.. ఈ క్రమంలో భర్త చనిపోవడంతో కుటుంబానికి దిక్కులేకుం డా పోయిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తనకు ఇద్దరు కూ తుర్లు, కుమారుడు ఉన్నారని.. తనకు ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని కోరుతూ.. గురువారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం వరకు మృతదేహాన్ని ఉంచి ఆందోళన చేసింది. విషయం తెలిసిన ఎస్‌ఐ చిన్నపెద్దయ్య అక్కడకు చేరుకుని యశోద కు నచ్చచెప్పడంతో ఆమె ఆందోళన విరమించింది.

వెంకటరమణ మృతదేహం బయటపడేనా...!

● రెండు రోజులుగా గాలిస్తున్న రెస్క్యూ టీమ్

● అనుమానాలు వ్యక్తం చేస్తున్న బంధువులు

● అధికారుల తీరును నిరశిస్తూ ఆందోళన



వెంకటరమణ గల్లంతైన క్వారీ వద్ద ప్రజలు



కడప-బెంగళూరు జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న కుటుంబ సభ్యులు

గుర్రంకొండ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఈతకు వెళ్లి క్వారీలో పడి మృతి చెందినట్లు చెబుతున్న వెంకటరమణ (24) మృతదేహం లభ్యం కాకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నీటిలో పడిన ఏ వ్యక్తి అయినా చనిపోతే 24 గంటల తరువాత మృతదేహం నీటిపై తేలుతుందన్నారు. వెంకటరమణ క్వారీలో పడి 30 గంటలు గడిచినా మృతదేహం తేలకపోవడం, రెండు రోజులుగా ఫైర్, రెస్క్యూ టీమ్ సభ్యులు గంటల తరబడి వెతికినా మృతదేహం ఆచూకీ లభ్యం కాలే దు. ఈ నేపథ్యంలో అధికారుల తీరును నిరసిస్తూ మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు దద్దాలవారిపల్లెకు సమీపంలోని కడప-బెంగు ళూరు జాతీయ రహదారిపై గురువారం ధర్నా చేశారు. తమ కుమారు డిని వెతకడంతో అలసత్వం చేస్తున్నారంటూ మధ్యాహ్నం 3 గంటల సమయంలో సుమారు గంటసేపు రోడ్డుపై బైఠాయించారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడి వాహనాలు బారులు తీరాయి. విషయం తెలుసుకొని అక్కడకు చేరుకొన్న తహశీల్దార్ శ్రీనివాసులు, వాల్మీకీపురం సీఐ ప్రసాద్‌బాబులు బాధితులతో మాట్లాడి మృతదే హాన్ని వెలికితీయడానికి అన్ని విధాలా చర్యలు చేపడుతున్నామని తెలి పారు. కర్నూలు నుంచి ఎస్‌డీఆర్ఎఫ్ బృందం వస్తున్నట్లు తెలిపారు. ఈ బృందం రాగానే మృతదేహాన్ని గంటల వ్యవధిలోనే బయటకు తీస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు. కాగా, క్వారీలో వెంకట రమణ మృతదేహం ఉందా... ఉంటే ఎందుకు దొరకడం లేదు... లేక పోతే వెంకటరమణను తోడుగా వచ్చిన వారు ఏమైనా చేశారా అన్న అనుమానాలను బంధువులు వ్యక్తం చేస్తున్నారు.

వెంకటరమణ ఎక్కడున్నావురా....

పండగ పూట స్నేహితులతో కలిసి ఆడుకొని తిరిగి ఇంటికి వస్తానంటి వే...అంతలోనే కనబడకుండా పోతివే.. అంటూ వెంకటరమణ తండ్రి సూరి బోరున విలపించడం చూపరులను కలచివేసింది.

ట్రాక్టర్ల చోరీ కేసులో నిందితుడు అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న పులివెందుల సీఐ

సింహాద్రిపురం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకాళమ్మగూడూరు గ్రామ సమీపాన గత నెల 29వ తేదీ రాత్రి ఒక ట్రాక్టరు, రెండు ట్రాలీలు చోరీకి గురయ్యా యి. ఈ కేసుకు సంబంధించి నిందితుని అరెస్ట్ చేసినట్లు పులివెందుల రూరల్ సీఐ వెంకటరమణ తెలిపారు. ఆయన వివరాల మేరకు... బాధితుడు కటికిరెడ్డి శ్రీనివాస రెడ్డి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి.. పులివెం దుల డీఎస్పీ మురళీ నాయక్ నేతృత్వంలో సింహాద్రిపురం ఎస్‌ఐ తులసీ నాగప్రసాద్‌తో కలసి విచారణ చేపట్టామని తెలిపారు. ఈ నేపథ్యంలో పులివెందుల మెయిన్ రోడ్డు లోని హిమకుంట్ల క్రాస్ రోడ్డు వద్ద అనుమానాస్పదంగా కనిపించిన సింహాద్రిపురం గ్రామం బీడీ కాలనీకి చెందిన యర్రగుడి బాబా అలియాస్ చోటును అరెస్టు చేశామ న్నారు. అతన్ని విచారణ చేయగా నేరం అంగీకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సింహాద్రిపురం ఎస్‌ఐ తులసీ నాగప్రసాద్, లింగాల ఎస్‌ఐ మధుసూదన్‌రావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఉపాధ్యాయుడు మృతి



కమలాపురం రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కమలాపు రం మండలం గంగవరం ఎం పీయూపీ పాఠశాలలో స్కూలు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న తుల సీధర్ (55) గురువారం ఉద యం ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతి చెం దాడు. తులసీధర్ మూడు రో జుల క్రితం బైకులో కడపకు వెళుతుండగా ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు కడపలోని ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించడం తో అక్కడ చికిత్స పొందుతూ.. పరిస్థితి విషమించడంతో గురువారం ఉదయం మృతి చెందాడు. ఈయన స్వస్థలం మండల పరిధిలోని చదిపిరాళ్ల గ్రామం. అందరితో కలివి డిగా ఉంటూ ఆప్యాయంగా పలకరించే తులసీధర్ మృతి తో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తులసీధర్ మృతి పట్ల ఉపాధ్యాయసంఘ నాయకులు, ఉపాధ్యాయులు సంతాపం వ్యక్తం చేశారు.

మిద్దెపై నుంచి పడి ఆర్‌ఎంపీ మృతి

ఓబులవారిపల్లె, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్ ఎంపీ ప్రమాదవశాత్తు మిద్దెపై నుంచి పడి మృతి చెం దాడు. ఓబులవారిపల్లెకు చెందిన బశెట్టి సుబ్రమణ్యం (61) మండల పోలీసుస్టేషన్‌కు వెళ్లేదారిలో ప్రథ మ చికిత్స కేంద్రం నడిపేవారు. గురువారం సాయంత్రం మిద్దె పైన జామకాయలు కోసే క్రమంలో కాలుజారి సన్‌సైడ్ బండ మీదపడడంతో తలకు తీవ్రగాయమైంది. మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించే క్రమంలో మృతి చెం దాడు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నట్లు తెలిపారు.


గొబ్బెమ్మ ఊరేగింపులో ఘర్షణ



గుమికూడిన జనం

ఒంటిమిట్ట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం లోని గొబ్బెమ్మ ఊరేగింపులో రెండు వర్గాల యువకులు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. స్థానిక కల్లావీది నుంచి గొబ్బెమ్మను మహిళలు, యువకులు కేరింతలు కొడుతూ అమ్మవారిని నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహి స్తున్న సమయంలో మాడవీధికి చెందిన కొంతమంది యువకులు గొబ్బెమ్మ ఊరేగింపులో పాల్గొనేందుకు రావ డంతో ఇరువర్గాలు మధ్య ఒక్కసారిగా ఘర్షణ చోటు చేసు కుంది. ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో అక్కడే ఉన్న మహిళలు, యువకుల మధ్య ఏమి జరుగుతుందోనన్న ఆందోళన నెలకొంది. ఇరువర్గాలవారు పెద్దఎత్తున ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో కొద్దిసేపు ఉద్రిక్తత వాతావ రణం నెలకొంది. గొబ్బెమ్మ మీద ఊరేగింపులో పాల్గొనే మహిళలపై దాడి చేయడంతో ఒక్కసారిగా వారి బంధు వులు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. విషయం ఎస్‌ఐ శివప్రసాద్ దృష్టికి తీసుకురావడంతో వెంటనే ఘటన స్థలానికి వచ్చిన ఎస్‌ఐ శివప్రసాద్ ఇరువర్గాలవారిని చెద రగొట్టారు. దాడిలో బంగారు చైనుతో పాటు బంగారు వస్తువులు పోయినట్లు పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. ఇరువర్గాలవారిని పిలిపించి చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్‌ఐ శివప్రసాద్ తెలిపారు.

బస్సు బోల్తా... పలువురికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో బోల్తాపడ్డ బస్సు, గాయపడ్డ ప్రయాణికులు

కురబలకోట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కురబలకోట పంచాయతీ జంగావారిపల్లె సమీపంలో బుధ వారం రాత్రి ప్రైవేట్ బస్సు బోల్తా పడింది. ఈ ప్రమా దంలో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా.. ప్రకాశం జిల్లా మార్కాపురం నుంచి బెంగళూరుకు వెలు తున్న బస్సు మార్గమధ్యంలోని కురబలకోట మండలం జంగా వారిపల్లె సమీపంలో డ్రైవర్ కునుకు తీయడంతో డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈప్రమాదంలో 10మంది దాకా తీవ్రంగా గాయపడ్డారు. వారిని 108 సాయంతో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ నరసింహులు పరి స్థితి ఆందోళనకరంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమి త్తం తిరుపతికి తరలించారు. ముదివేడు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిం చారు. ముదివేడు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పుత్తా పుల్లారెడ్డికి భూతపురి స్మారక పురస్కారం



పుత్తా పుల్లారెడ్డి

కడప కల్చరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ సాహితీవేత్త భారత భారతి పుత్తా పుల్లారెడ్డి మహాకవి, శతావధాని డాక్టర్ భూతపురి సుబ్రమణ్యశర్మ 23వ స్మారక సాహిత్య పురస్కారానికి ఎంపికయ్యారు. డాక్టర్ భూత పురి సుబ్రమణ్యశర్మ మెమో రియల్ ట్రస్టు, అల్లసాని పెద్దన సాహితీ పీఠం సంయుక్త ఆధ్వర్యం లో ఫిబ్రవరి 16న ఆదివారం ఉదయం 10గంటలకు కడప సీపీ బ్రౌన్ బాషా పరిశోధన కేంద్రంలో జరిగే భూతపురి 88వ జయంతి మహోత్సవంలో ఈ పురస్కారం అందజే యనున్నారు. సాహిత్య జ్యోతిష్య రంగాల్లో విశిష్ట సేవలందించిన వ్యక్తులకు 2003 నుంచి ఈ పురస్కారం అందిస్తు న్నట్లు భూతపురి సుబ్రహ్మణ్యశర్మ మెమోరియల్ ట్రస్టు కార్యదర్శి భూతపురి శివరామసురేంద్ర శర్మ తెలిపారు. ఆక్రమంలో పుత్తా పుల్లారెడ్డిని రూ.10,116 లతో నగదు, జ్ఞాపికతో సత్కరిస్తున్నట్లు తెలిపారు. వృత్తిరీత్యా ఇంజనీరు అయిన పుత్తా పుల్లారెడ్డి పదవీ విరమణ తరువాత సాహిత్యరంగంలో అడు గుపెట్టి అనేక పరిశోధనాత్మక రచనలు, వ్యాఖ్యానాలు, సంకలన గ్రంథాలు, రచనలు వెలువరించడం విశేషమన్నారు. పుత్తా పుల్లారెడ్డి నీటిపారుదల శాఖలో సూపర్‌వైజర్ స్థాయి నుంచి ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు స్థాయి వరకు పనిచేసి పదవీ విరమణ చేశారన్నారు. ఆయన సాహిత్య కృషిని గుర్తించి పలు సంస్థలు ఘనంగా సత్కరించాయని తెలిపారు.

రైతు బిడ్డకు జంప్‌రోప్‌లో బంగారుపతకం



రామిరెడ్డి ప్రసన్న

వేంపల్లె, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముతు కూరు గ్రామానికి చెందిన రామిరెడ్డి ప్రసన్న జంప్‌రోప్ క్రీడలో అద్భుతంగా రాణిస్తోం ది. అంతర్జాతీయస్థాయిలో నేపాల్‌లో జరిగిన పోటీల్లో వివిధ దేశాలతో పోటీపడి బంగారు పతకం అందుకుంది. పేద రైతు రామిరెడ్డి చంద్ర ఓబుళరెడ్డి, రామలక్షుమ్మల కుమార్తె ప్రసన్న సింహాద్రి పురం కస్తూర్బా పాఠశాలలో చదుకుంటూ ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో జంప్‌రోప్ క్రీడల్లో పాల్గొంది. అంతర్జాతీయస్థాయిలో కూడా రాణించి పతకాలు సాధించింది.

అక్రమ కట్టడాలు కూల్చివేత



అక్రమ కట్టడాలను కూల్చి వేయిస్తున్న వీఆర్వో శ్రీనివాసులు

కడప కలెక్టరేట్ జనవరి 16 (ఆంధ్రజ్యోతి) నగర పరిధి లోని ఉక్కాయపల్లి బైపాస్ రోడ్డు, చలమారెడ్డిపల్లెలో ప్రభు త్వ స్థలంలో అక్రమ నిర్మాణాలను రెవెన్యూ సిబ్బంది గురు వారం రాత్రి కూల్చివేశారు. నాలుగు సెంట్ల స్థలంలో సెలవు రోజుల్లో కబ్జాదారులు రాత్రికి రాత్రి అక్రమంగా బేస్ మట్టాలు నిర్మిం చారు. విషయం తెలుసుకున్న తహ సీల్దారు నారాయణరెడ్డి వెంటనే నిర్మా ణాలు తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, వీఆర్వో శ్రీనివాసులు, సర్వేయర్ శివకుమార్‌లు ఆస్థలంలో నిర్మాణాలను ఎక్స్‌కవేటర్‌తో కూల్చివేశారు.

దాడి ఘటనలో ఇరువురిపై కేసు నమోదు

ఒంటిమిట్ట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మంటంపల్లె గ్రామానికి చెందిన మనోహర్‌రెడ్డి, గాండ్లపల్లెకు చెందిన రవికుమార్ మరో వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో ఇరువురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. గత 26న ఇరువురు స్థానిక గంగమ్మ గుడి వద్ద డబ్బులు విషయమై ఘర్షణ పడడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఫిర్యాదు స్వీకరించకపో వడంతో బాధితుడు మనోహర్‌రెడ్డి కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు ఇరువురిపై కేసు నమోదు చేశామని హెడ్‌కానిస్టేబుల్ సుబ్బరాజు తెలిపారు.

సిబ్బంది సమయపాలన పాటించాలి: ఎంపీడీవో



చిన్నచెప్పలి సచివాలయంలో సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో జ్యోతి

కమలాపురం రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని అన్ని సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని ఎంపీడీవో జ్యోతి అన్నారు. గురువారం మండల పరిధిలోని చిన్నచెప్పలి, పెద్దచెప్పలి, కోగటం సచివాలయాలను ఆమె సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయ సిబ్బందికి సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రభుత్వానికి సంబంధించిన ఆస్తులు అన్ని ఆన్‌లైన్‌లో ఉంచాలన్నారు. పెండింగు లో ఉన్న పనులు పూర్తి చేయాలని, పీఏసీ, ఈకేవైసీ, ఇంకా కొన్ని సర్వేలు త్వరగా పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి ఆదేశించారు. ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దని ఆదేశించారు.

20న టెంకాయల వేలం

సికెదిన్నె, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): గంగమ్మగుడి టెంకాయల వేలం ఈనెల 20వ తేదీ నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో తెలిపారు. వేలంలో పాల్గొనేవారు రూ.50వేలు డిపాజిట్ చెల్లించి సోమవారం ఉదయం 11 గంటలకు గంగమ్మ ఆలయం సమీపంలో అధికారుల సమక్షంలో బహిరంగ వేలం సంవత్సరకాలానికి నిర్వహిస్తామన్నారు. ఈ వేలంలో హెచ్చుపాట దారునికి టెంకాయలు విక్రయించుకునే హక్కు కల్పిస్తామన్నారు. పూర్తి వివరాలకు దేవస్థానంలో సంప్రదించాలని కోరారు.

ఎన్టీఆర్ సర్కిల్‌లో చెట్లను తొలగించాలి

కడప నాగరాజుపేట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎన్టీఆర్ సర్కిల్‌లో విగ్రహం కనిపించకుండా చెట్లు పెరిగాయని, వాటిని తొలగించాలని కార్పొరేషన్ అధికారులను టీడీపీ నేత కొండాసుబ్బయ్య కోరారు. ఈనెల 18న టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వర్ధంతి రోజున కార్యక్రమాలు నిర్వహించనున్నారన్నారు. అయితే అక్కడ ఎన్టీఆర్ విగ్రహం కనిపించకుండా చెట్లు పెరిగినందున ఇబ్బందిగా ఉందన్నారు. చెట్లను తొలగించి సుందరీకరణ చేపట్టాలని ఈ సందర్భంగా కోరారు.

చిత్రం చెప్పిన సమస్య



శివాలపల్లె జింకలవంక కంపచెట్లు, పిచ్చిమొక్కలతో నిండి ఉంది. వర్షాకాలం పెండ్లిమర్రి, సీకేదిన్నె, వల్లూరు మండలాల నుంచి వచ్చే నీరంతా ఈ వంక గుండానే పెన్నానదిలో కలుస్తాయి. వంక నిండా చెట్లు ఉండటంతో నీటి ప్రవాహానికి దారి లేక పక్కనే ఉన్న శివాలపల్లెలోకి వెళుతుండటంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతోందని గ్రామస్థులు తెలిపారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని వారు కోరుతున్నారు. - చెన్నూరు, (ఆంధ్రజ్యోతి)

ఎన్నికల హామీలను నిలబెట్టుకోకుంటే ఉద్యమం

● ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యర్శి మల్లు రఘునాథరెడ్డి



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి

కడప ఎడ్యుకేషన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత కూటమి ప్రభుత్వం 2024 సాధారణ ఎన్నికల ప్రచారంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే ఉద్యమిస్తామని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి పేర్కొన్నారు. గురువారం కడపలోని ఎస్టీయూ భవన్‌లో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్లుగా రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు వారి జీతాలు మినహా మరే ఇతర ఆర్థికపరమైన లబ్ధిపొందలేదని, సరెండర్ లీవులు, డీఏ అరియర్స్ పీఆర్‌సీ బకాయిలు, రెండు సంవత్సరాల నుంచి ఏపీజీఎల్ఐ పాలసీలు మెచ్యూర్ అయినప్పటికి చెల్లింపులు మరిచారన్నారు. మొత్తం బకాయిలు రూ.32వేల కోట్లు ఉండగా ఈ సంక్రాంతికి కేవలం 10శాతం మాత్రమే చెల్లించారన్నారు. మిగిలిన 90శాతం సంగతి ఏమిటని ప్రశ్నించారు. 12వ వేతన సవరణ సంఘానికి సంబంధించిన కమిషన్ ఏర్పాటు ప్రక్రియ మొదలుపెట్టలేదని, ఇప్పటికే 19 నెలలు ఆలస్యమైందన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు అవుతోందని, ఇప్పటికీ ఎన్నికల హామీలు అయిన బకాయిల చెల్లింపు, 12వ పీఆర్సీ అంశాలపై ఉద్యోగ సంఘాలను చర్చలకే ఆహ్వానించడం లేదన్నారు. గత ప్రభుత్వం వల్లే ప్రస్తుత ప్రభుత్వం కూడా బడ్జెట్ పేరు చెప్పి ఉద్యోగ ఉపాధ్యాయులకు అన్యాయం చేయవద్దని సూచించారు. ఎస్టీయూ నాయకులు ఇలియాస్ బాషా, సంగమేశ్వర్‌రెడ్డి, రామ్మోహన్, కె.సురేష్‌బాబు, బాలగంగిరెడ్డి, రవిశంకర్‌రెడ్డి, చెన్నకేశవరెడ్డి, రెడ్డన్న, బాబు పద్మాకర్, మహబూబ్ బాష, వెంకటసుబ్బయ్య, దామోదర సాదిక్ అలి, జయంరాం, కరిముల్లా, కృష్ణానాయక్ తదితరులలు పాల్గొన్నారు.

ఇద్దరు అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు

వేంపల్లె, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణం వడ్డెర వీధిలో ఎస్ఐ రంగారావుపై, పోలీసులపై ఎదురుతిరిగి దురుసుగా ప్రవర్తించి విధులకు ఆటంకం కలిగించిన మల్లికార్జున, శివలను అరెస్టు చేసినట్లు సీఐ సురేష్‌రెడ్డి తెలిపారు. వడ్డేవీధికి చెందిన గౌరీ భర్త మల్లికార్జున వేధిస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేయగా వడ్డె వీధిలోకి పోలీసులు వెళ్లారు. పోలీసులకు ఎదురుతిరిగి విధులకు ఆటంకం కలిగించారు. ఎస్ఐ రంగారావు వెళ్లగా ఆయనపై దురుసుగా ప్రవర్తించారు. కానిస్టేబుల్ నజీర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించారని సీఐ వివరించారు.

రోడ్డు భద్రతానియమాలు పాటించండి

● డీఎస్పీ మురళి

పులివెందుల టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) :వాహనదారులు రోడ్డు భద్రతానియమాలు పాటించాలని డీఎస్పీ మురళి అన్నారు. గురువారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో 36వ జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలకు సంబంధించి వాల్‌పోస్టరును మోటారు వెహికల్ ఇన్స్‌పెక్టరు బీవీ ప్రసాద్‌తో కలిసి ఆవిష్కరించారు. నేటి నుంచి ఫిబ్రవరి 15 వరకు ఈ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్సు ఉన్న వాహనదారులు మాత్రమే వాహనాలు నడపాలన్నారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, కార్లు నడిపేవారు సీటుబెల్టు పెట్టుకోవాలన్నారు. వాహనాలకు సంబంధించి పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. నూతన రవాణా చట్టం మేరకు 18 ఏళ్లలోపు పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని తల్లిదండ్రులకు డీఎస్పీ సూచించారు. యువత ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సెల్‌ఫోను మాట్లాడుతూ వాహనాలు నడపవడం, మద్యం సేవించి వాహనాలు నడపడం చాలా ప్రమాదకరమన్నారు. ఆటోడ్రైవర్లు తమ ఆటోలో ఐదుగురికి మించి ఎక్కించరాదన్నారు. ప్రతి వాహనదారుడు ఆర్టీఏ నిబంధనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ సీఐ నరసింహులు, ట్రాఫిక్ సీఐ హాజీవల్లి, ఆర్టీసీ డీఎం రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలి



నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు ఉద్యోగులు

జమ్మలమడుగు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): బీసీ వెల్ఫేర్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలని కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. గురువారం పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని, నెల నెలా జీతాలను పెండింగ్ లేకుండా విడుదల చేయాలని తదితర సమస్యలపై డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ ఉపాధ్యక్షుడు వినయ్‌కుమార్, సీనియర్ నేతలు యేసుదాసు, కన్వీనర్ చంద్రాయుడు, సభ్యులు, కాంట్రాక్టు ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత పాటించాలి

జమ్మలమడుగు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): వాహనాల్లో వెళ్లేవారు, డ్రైవర్లు రోడ్డు భద్రత పాటించాలని జమ్మలమడుగు అర్బన్ సీఐ లింగప్ప సూచించారు. గురువారం ఆర్టీసీ డిపో ప్రాంగణంలో నిర్వహించిన రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో సీఐ డ్రైవర్లకు సూచనలు, సలహాలు ఇచ్చారు. డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్‌లో మాట్లాడరాదన్నారు.

భారతదేశం భిన్న సంస్కృతులకు నిలయం

● మైసూర్ విశ్వవిద్యాలయ వీసీ ప్రొఫెసర్ ఎంకే లోకనాథ్



మైసూర్‌లో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, పీఓలు

కడప ఎడ్యుకేషన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): భారతదేశం భిన్న సంస్కృతులకు నాగరికతలకు నిలయం. అలాంటి సంస్కృతులు, జీవన విధానాన్ని పరస్పరం గౌరవించుకోవడం ద్వారా జాతీయ సమైక్యతకు విలువ ఇచ్చినట్లు అవుతుందని మైసూర్ విశ్వవిద్యాలయ వైస్ చాన్సిలర్ ప్రొఫెసర్ ఎంకే లోకనాథ్ అన్నారు. మైసూర్ విశ్వవిద్యాలయం జాతీయ సమీకృత శిబిరాలను ప్రతి ఏటా నిర్వహించడంలో భాగంగా జనవరి 16 నుంచి 22 వరకు ఏడు రోజులు నిర్వహించనున్న శిబిరాన్ని ప్రారంభించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి హాజరైన ఎన్ఎస్ఎస్ వలంటీర్‌ను ఉద్దేశించి వీసీ మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వం భారతదేశ ప్రత్యేకత అన్నారు. ఒక రాష్ట్ర సంస్కృతిని మరొక రాష్ట్రానికి పరిచయం చేయడం వారి జీవన విధానాన్ని సంస్కృతిని తెలుసుకోవడం ఎంతో అవసరమన్నారు. జాతీయ శిబిరాలలో పాల్గొనడం వల్ల సమాజం పట్ల గౌరవం, బాధ్యత పెరుగుతుందన్నారు. పర్యావరణ పరిరక్షణలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు కీలక భూమిక పోషించాలన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ ఎంబీ సురేష్, మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్‌ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి.వి కృష్ణారెడ్డి, యోగివేమన విశ్వవిద్యాలయ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎన్.వెంకటరామిరెడ్డికి నేతృత్వం వహించారు.వైవీయూ సమన్వయకర్త డాక్టర్ ఎస్వీ రామిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

విత్తనశుద్ధితో తెగుళ్లను నివారించవచ్చు: ఏడీఏ



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ సిబ్బంది

కమలాపురం రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): విత్తన సమయంలో విత్తనాలను శుద్ధి చేయడం ద్వారా తెగుళ్లను నివారించుకోవచ్చని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. గురువారం మండల పరిధిలోని ఎల్లారెడ్డిపల్లె, వంకమాడ గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయాధికారి ఎం.సరస్వతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా విత్తనాలను శుద్ధి చేసుకోవాలన్నారు. విత్తనశుద్ధి చేసినప్పుడు అందులో ఉన్న కీటకాలు నశిస్తాయన్నారు. అలాగే ఇ-పంట నమోదు, ఫార్మర్ ఇ-కేవైసీని తప్పకుండా చేసుకోవాలన్నారు. జనవరి, ఫిబ్రవరి మాసాల్లో నూగు, పెసర, వేరుశనగ పంటలను విత్తుకోవడానికి అనుకూలమని తెలిపారు. గ్రామ వ్యవసాయ సహాయకుడు కె.బాబు, రైతులు పాల్గొన్నారు.

దర్గా దర్శనం... పూర్వజన్మ సుకృతం



పెద్దదర్గాను సందర్శించుకున్న అన్వేష్‌రెడ్డి

కడప కల్చరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని ప్రఖ్యాత పెద్దదర్గాను దర్శించుకోవడం తన పూర్వజన్మ సుకృతమని తెలంగాణ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి అన్నారు. నగరంలోని అమీన్‌పీర్ దర్గా (పెద్దదర్గా)ను ఆయన గురువారం దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మహిమ గల ప్రపంచ ప్రసిద్ధిగాంచిన పెద్దదర్గాను దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. దర్గాను సందర్శించిన వారిలో సంఘ సేవకుడు సలావుద్దీన్ ఉన్నారు.

అంజన్న ఆలయంలో నత్తనడకన నిర్మాణ పనులు



పునాది వరకు వచ్చి ఆగిపోయిన పడమర రాజగోపురం పనులు

చక్రాయపేట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): రాయలసీమలో ప్రసిద్ధిగాంచిన గండి వీరాంజనేయస్వామి ఆలయంలో అభివృద్ధి పనులు పూర్తయ్యేదెన్నడోనని భక్తులు భక్తులు ఎదురుచూస్తున్నారు. కానీ ఆలయ పనులు మాత్రం నత్తనడకన జరుగుతున్నాయి. ఈ ఏడాదైన అంజన్న దర్శనభాగ్యం దొరుకుతుందా... ప్రారంభం కాకపోవడానికి అధికారుల నిర్లక్ష్యమా...లేక రాజకీయ గ్రహణమా అంటూ గుసగుసలాడుతున్నారు. దాదాపు మూడు సంవత్సరాలు కిందట ఆలయ పునఃనిర్మాణ పనులు ప్రారంభించారు. కానీ నేటికి పనులు పూర్తకాకపోవడంతో స్వామివారి దర్శనం కోసం ఎదురుచూడాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. వివరాల్లోకి తే.... అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆలయ పునఃనిర్మాణానికి సీజీఎఫ్ కింద దాదాపు రూ.14.50కోట్లు నిధులు మంజూరు చేశారు. ఆ పనులు టెండర్ల ద్వారా తమిళనాడుకు చెందిన వ్యక్తులు దక్కించుకున్నారు. పనులు వేగవంతం చేశారు. ఆ తర్వాత ఆలయ నిర్మాణం నత్తనడకన జరుగుతూ వచ్చింది. ఆ నిధులు సరిపోవని మళ్లీ రూ.5.50కోట్లు తిరిగి మంజూరు చేశారు. అనంతరం ప్రాకారం, తూర్పు రాజగోపురం, పడమర రాజగోపురం, అలాగే ఆలయ విద్యుత్ సామాగ్రి ఆలయ లోపల బండపరుపు, ప్రాకారం, నీటి సౌకర్యం పనులు మిగిలిపోయాయి. వీటి కోసం మళ్లీ రూ.6.15కోట్లు మంజూరు చేశారు. అంటే గండి ఆలయ పునఃనిర్మాణం కోసం దాదాపు రూ.26కోట్లు మంజూరైంది. కానీ నిధులు ఉన్న పనులు ఎందుకు చేయలేకపోయారు, ఇంత ఆలస్యం ఎందుకు జరిగింది అధికారుల నిర్లక్ష్యమా, లేక పాలకుల ఉదాసీనత అని భక్తులు అంటున్నారు. గండి ఆలయ పనులు నత్తనడకన జరుగుతున్నాయని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఈఓ వెంకటసుబ్బయ్యను పిలిచి పనులు వేగవంతం చేయాలని కోరారు. అలాగే ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి పదేపదే అధికారులపై, కాంట్రాక్టర్లపై ఒత్తిడి తెస్తున్నారు. ఇప్పటికైన పనులు వేగవంతం చేసి ఈ ఏడాది త్వరలో ప్రారంభించాలని గట్టిగా చెప్పినట్లు తెలిసింది. ఆలయం ప్రారంభానికి నోచుకోకపోవడంతో బాలాలయంలో భక్తులు ర్శనం చేసుకుంటూ నిరుత్సాహంగా వెళ్తున్నారు. ఆ ఆలయం ఎప్పుడు కలుగుతుందో, మాకు దర్శనభాగ్యం ఎప్పుడు కలుగుతుందో భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన అధికారులు, పాలకులలు స్పందించి ఆలయాన్ని త్వరగా ప్రారంభించాలని కోరారు.

పనులు శరవేగంగా చేయిస్తున్నాం



గండి వీరాంజనేయ స్వామి ఆలయంలో ఆలయ పునఃనిర్మాణ పనులు బాగా జరుగుతున్నాయి. త్వరలో ప్రారంభించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ప్రహరీ, పడమర రాజగోపురం పనులు ఉన్నాయి. ఆ పనులు చేపట్టి బండపరుపు, కరెంటు, నీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించాం. దీంతో కాంట్రాక్టర్ పనులు వేగవంతం చేశాడు. వీలైనంత త్వరలో పనులు పూర్తిచేస్తాం.

- వెంకటసుబ్బయ్య, ఈఓ, గండి క్షేత్రం

రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు



వడ్డెపల్లెలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు

చక్రాయపేట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలేకాంపల్లె గ్రామం వడ్డెపల్లెలో మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తోందని, అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు తెలిపారు. ఎంపీడీఓకు ఫిర్యాదు చేసినా లాభం లేదన్నారు. రోడ్డు వెంబడి మురుగు ఉండటంతో గ్రామలో అడుగుపెట్టాలంటే భయమేస్తోదన్నారు. చాలా రోజులుగా రోడ్డుపై మురుగు నీరు ప్రవహిస్తుండటంతో పాచికట్టి జారిపడుతున్నామని, దోమలు అధికమై జ్వరాలు వస్తున్నాయన్నారు. కొందరు రోడ్డుపైనే కొళాయిలు విడిచి, బట్టలు ఉతుకుతుకున్నారన్నారు. డ్రైనేజీలు అయినా ఏర్పాటు చేయాలని, లేదా నీరు ప్రవహించకుడా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

కోడిపందెం రాయుళ్ల అరెస్టు

లింగాల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కోడిపందెం స్థావరంపై దాడిచేశన 8 మంది కోడిపందం రాయుళ్లను గురువారం అరెస్టు చేశామని ఎస్ఐ మధుసూధన్‌రావు తెలిపారు. మండలంలోకి అంబకపల్లె ఘాట్ వద్ద కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు వారిపై దాడి చేసి 8 మందిని, 9 కోళ్లను, రూ.8730 నగదును పట్టుకున్నామని, పట్టుబడిన వారు పులివెందుల, నల్లపురెడ్డిపల్లె గ్రామాలకు చెందిన వారని ఆయన వివరించారు.

అంజద్‌బాషాకు సన్మానం



అంజద్‌బాషాను సత్కరిస్తున్న ఆదిత్య తదితరులు

కడప ఎర్రముక్కపల్లె, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషాకు సన్మానం చేశారు. నగర అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా జిల్లా యువజన సంఘం అధ్యక్షుడు దేవిరెడ్డి ఆదిత్య అంజాద్‌బాషా నివాసంలో ఆయనకు గజమాల వేసి దుశ్శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా అంజద్‌బాషా మాట్లాడుతూ వైసీపీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. జిల్లాలో వైసీపీకి మళ్లీ పూర్వవైభవం తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ అజ్మతుల్లా, కో-ఆప్షన్ సభ్యులు హారున్‌బాబు, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ ఇబ్రహీం మియా, నాయకులు బలరాం, ఫజల్, పీరు, మౌలా, మన్సూర్, డెక్కన్ బిలాల్, రాజా తదితరులు పాల్గొన్నారు.

నేడు సింహాద్రిపురంలో పింఛన్ల పరిశీలన

సింహాద్రిపురం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సింహాద్రిపురం మండల వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో శుక్రవారం ప్రత్యేక బృందాలచే పింఛన్ల పరిశీలన జరుగుతుందని ఎంపీడీఓ కృష్ణమూర్తి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రత్యేక బృందాల వారు పింఛనుదారుల ఇంటివద్దకే వెళ్లి పరిశీలిస్తారన్నారు. కావున పింఛనుదారులు వారి ఇంటి వద్ద అందుబాటులో ఉండాలని ఆ ప్రకటనలో ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు.

ముఖద్వారాన్ని ప్రారంభించిన రితీష్‌రెడ్డి

పోరుమామిళ్ల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): బలిజకోటలోని వీరాంజనేయస్వామి రహదారి ప్రధాన మార్గంలో స్వామి ముఖద్వారాన్ని బద్వేలు టీడీపీ సమన్వయ కర్త రితీష్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. పోరుమామిళ్ల సర్పంచ్ యనమల సుధాకర్ సొంత నిధులతో ముఖద్వారాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ సర్పంచ్ బలిజకోటలోకి ప్రవేశించే కూడలిలో ముఖద్వారం నిర్మించామన్నారు. బలిజకోటకు ఒక చరిత్ర ఉందన్నారు. ఉదయగిరి కోటను నిర్మించిన విజయనగర సామ్రాజ్య రాజులు ఇక్కడ కోటను నిర్మించి చుట్టుపక్కల ప్రాంతాలను పాలించేవారని ఇందుకు గుర్తుగా నేటికీ బలిజకోటలో గుర్తులున్నాయన్నారు. కోట ముఖద్వారంలో వీరాంజనేయస్వామి ఆలయం నేటికీ ఉందన్నారు. దానికి గుర్తుగా ఈ ఆర్చిని నిర్మించామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు నగరి భైరవ ప్రసాద్, బద్వేలు మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్లు చెరుకూరి చెన్నరాయుడు, సాధనకారి రంతు, కొండారామక్రిష్ణారెడ్డి, కల్లూరు క్రిష్ణారెడ్డి, ఎంపీటీసీ శెట్టిం ప్రతాప్, టీడీపీ నేతలు మహబూబ్‌బాషా (బీజ్జె), షరీఫ్, అతికారి రాజా, నీటిసంఘం అధ్యక్షులు తోట వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

అల్లుకున్న తీగలు - పొంచి ఉన్న ప్రమాదం


పొలాల్లో స్తంభాలు, విద్యుత్తు వైర్లకు అల్లుకున్న ఆకు తీగలు

దువ్వూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్తు ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. ఆరుతడి పంటలు వేసిన పొలాల్లో పంటల సాగుకు నీటి తడులు ఇచ్చేందుకు పలు చోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. వీటి వద్ద విద్యుత్తు స్తంభాలకు ఉన్న కరెంటు తీగల ద్వారా ట్రాన్స్‌ఫార్మర్లకు కనెక్షన్లు ఇచ్చారు. పొలాల్లో అంతా బాగున్నా పచ్చని ఆకు తీగెలు స్తంభాలకు ఎగబాకి కరెంటు వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లకు సైతం అల్లుకుంటున్నాయి. దీంతో కొన్ని చోట్ల ట్రిప్ కావడం, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడం లాంటి సంఘటనలు జరుగుతున్నాయి. ఇటువంటి సమస్యలతో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడమే కాదు ప్రాణాపాయ సంఘటనలు జరిగే అవకాశం లేకపోలేదు. ఈ తరహా సమస్యలున్న చోట విద్యుత్తు శాఖ ప్రమాద నివారణ చర్యలను చేపట్టాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.

దాతల లక్ష్యం నిర్వీర్యం

20 ఎకరాల్లో పాఠశాల, మార్కెట్, ఎగ్జిబిషన్ సామగ్రి ● ఆటలు ఆడుకునేది ఎలా?

పట్టించుకోని మున్సిపల్ అధికారులు ● ఇదీ అనిబీసెంట్ మున్సిపల్ హైస్కూలు దుస్థితి

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధిని ఆశించిన స్థానిక దాతలు, పాఠశాల నిర్మాణ దాత విదేశీయురాలు లండన్‌కు చెందిన అనిబీసెంట్ లక్ష్యం నిర్వీర్యమైంది. 20 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన పాఠశాలలో ఓ వైపున పాఠశాల, మరో వైపున తాత్కాలిక మార్కెట్ అంటూ మార్కెట్ నిర్వహణ, ఇది చాలదన్నట్లు ఎగ్జిబిషన్ సామగ్రి ఉన్నాయి. ప్రస్తుతం అనిబీసెంట్ మున్సిపల్ హైస్కూలు విద్యార్థులు ఆడుకునే అవకాశాన్ని ఎగ్జిబిషన్ నిర్వాహకులు లాగేసుకున్నారు. పాఠశాల అభివృద్ధి చేయాల్సిన మున్సిపల్ అధికారులు పట్టించుకోకుండా చేష్టలుడిగిపోయారు. వివరాల్లోకెళితే...

సుమారు 107 ఏళ్ల చరిత్ర కలిగిన పాఠశాల పట్టణం మధ్యలో దాతల సహకారంతో ఏర్పాటు చేశారు. దీంతో అప్పట్లో నారాయణ మందిరం మొదలు టెన్త్ వరకు తరగతులు ఉండేవి. ఒక్కో తరగతికి సుమారు ఎనిమిది సెక్షన్లకు పైగానే తరగతి గదులు ఉండేవి. చక్కగా ఆడుకునేందుకు 20 ఎకరాల విస్తీర్ణంలో ఆటస్థలం, ఉంది. క్రీడలతోపాటు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు, ఎన్నికల సభలు, సమావేశాలు సైతం నిర్వహించేవారు. వేల మంది విద్యార్థులు చదివే పాఠశాలను ఇటీవల పాలకులు నిర్వీర్యం చేయడం ప్రారంభించారు. గతంలో దసరా ఉత్సవాల సందర్భంగా దసరా పదిరోజులు ఎగ్జిబిషన్ నిర్వహించేవారు. దీంతో ఎగ్జిబిషన్ నిర్వాహకులు మున్సిపాలిటీకి డబ్బు చెల్లించేవారు. అవి అడపాదడపా ఉపాయోగపడేవి. వైసీపీ పాలనలో పట్టణంలో మార్కెట్‌ను అభివృద్ధి పరుస్తామంటూ కోనేట్లో ఉన్న మార్కెట్‌ను తొలగించారు. తాత్కాలిక మార్కెట్ అంటూ అనిబీసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో మార్కెట్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో సగం మేరకు ఆక్రమణ జరిగింది.


విద్యార్థులు వెళ్లడానికి ఇబ్బందిగా ఉన్న ఎగ్జిబిషన్ ప్రవేశద్వారం

తర్వాత దసరా ఉత్సవాల సమయంలో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. దాన్ని దీపావళి వరకు పొడిగించారు. చివరకు ఎగ్జిబిషన్ సమయం ముగిసినా పూర్తిస్థాయిలో డబ్బు చెల్లించలేదని ఎగ్జిబిషన్ సామగ్రిని తరలించకుండా మున్సిపల్ అధికారులు కొందరిని కాపలాగా ఏర్పాటు చేశారు. గడువు ముగిసి రెండున్నర నెలలు దాటినా ఎగ్జిబిషన్ సామగ్రి మైదానంలోనే ఉండడంతో విద్యార్థులు ఆటలాడుకునే అవకాశం లేక నిరుత్సాహ పడుతున్నారు. ఆ మైదానంలో అనిబీసెంట్ మున్సిపల్ హైస్కూలు, హోమస్‌పేట మున్సిపల్ ప్రాథమిక పాఠశాల, గ్రేడ్-1 గ్రంథాలయాలు ఉన్నాయి. రెండు పాఠశాలలకు మధ్యలో ఎత్తుగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ప్రవేశ ద్వారంతో ఉన్నత పాఠశాల విద్యార్థులు పాఠశాలలోకి వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నారు. సంక్రాంతి సెలవుల్లోనూ ఆడుకునే అవకాశం లేదని వాపోతున్నారు. ఫిబ్రవరి రెండో వారంలో మైసూరు దత్తపీఠాధిపతి గణపతి సచ్చినందస్వామి ఆధ్వర్యంలో రెండు వేల మందితో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించడానికి ఎగ్జిబిషన్ సామగ్రి ఆటంకంగా మారింది. ఎగ్జిబిషన్ సమయంలో వర్షం నీటితో ఇబ్బంది లేకుండా ఉండడానికి పాఠశాల మైదానంలో సన్నటి చిప్స్ పరుస్తున్నారు. దీంతో విద్యార్థులు ఆడుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు. ఎగ్జిబిషన్‌తో లక్షల రూపాయలు ఆర్జిస్తున్న పాఠశాల మైదానం అభివృద్ధిపై ఏరోజూ దృష్టి సారించిన పాపాన పోలేదు. 110 ఏళ్ల కిందట దాతలు విద్యాభివృద్ధి లక్ష్యంగా ఏర్పాటు చేసిన పాఠశాల, విదేశీయురాలు అనిబీసెంట్ నిర్మించిన పాఠశాలలో మార్కెట్, ఎగ్జిబిషన్ ఏర్పాట్లతో దాతల లక్ష్యం నీరుగారిపోతోందని దాతలు, పలువురు పట్టణ ప్రముఖులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎగ్జిబిషన్ ఆదాయంలో కనీసం కొంత మొత్తాన్ని పాఠశాల అభివృద్ధికి ఖర్చు చేయాలని విద్యార్థులు, క్రీడాకారులు కోరుతున్నారు. మైదానంలో ఎగ్జిబిషన్ సామగ్రిని తరలించి ఆడుకోవడానికి అవకాశం కల్పించాలని కోరుతున్నారు.


మైదానంలో ఉన్న ఎగ్జిబిషన్ సామగ్రి

కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలి


నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు ఉద్యోగులు

జమ్మలమడుగు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): బీసీ వెల్ఫేర్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలని కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. గురువారం పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని, నెల నెలా జీతాలను పెండింగ్ లేకుండా విడుదల చేయాలని తదితర సమస్యలపై డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ ఉపాధ్యక్షుడు వినయ్‌కుమార్, సీనియర్ నేతలు యేసుదాసు, కన్వీనర్ చంద్రాయుడు, సభ్యులు, కాంట్రాక్టు ఉద్యోగులు పాల్గొన్నారు.

20న టెంకాయల వేలం

సికెదిన్నె, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): గంగమ్మగుడి టెంకాయల వేలం ఈనెల 20వ తేదీ నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో తెలిపారు. వేలంలో పాల్గొనేవారు రూ.50వేలు డిపాజిట్ చెల్లించి సోమవారం ఉదయం 11 గంటలకు గంగమ్మ ఆలయం సమీపంలో అధికారుల సమక్షంలో బహిరంగ వేలం సంవత్సరకాలానికి నిర్వహిస్తామన్నారు. ఈ వేలంలో హెచ్చుపాట దారునికి టెంకాయలు విక్రయించుకునే హక్కు కల్పిస్తామన్నారు. పూర్తి వివరాలకు దేవస్థానంలో సంప్రదించాలని కోరారు.

భారతదేశం భిన్న సంస్కృతులకు నిలయం

● మైసూర్ విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ ఎంకే లోకనాథ్



మైసూర్‌లో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, పీఓలు

కడప ఎడ్యుకేషన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): భారతదేశం భిన్న సంస్కృతులు, నాగరికతలకు నిలయం. అలాంటి సంస్కృతులు, జీవన విధానాన్ని పరస్పరం గౌరవించుకోవడం ద్వారా జాతీయ సమైక్యతకు విలువ ఇచ్చినట్లు అవుతుందని మైసూర్ విశ్వవిద్యాలయ వైస్ చాన్సెలర్ ప్రొఫెసర్ ఎంకే లోకనాథ్ అన్నారు. మైసూర్ విశ్వవిద్యాలయంలో ఏటా జాతీయ సమీకృత శిబిరాలను నిర్వహించడంలో భాగంగా జనవరి 16 నుంచి 22 వరకు శిబిరాన్ని ప్రారంభించారు. వీసీ మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వం భారతదేశ ప్రత్యేకత అన్నారు. ఒక రాష్ట్ర సంస్కృతిని మరొక రాష్ట్రానికి పరిచయం చేయడం, వారి జీవన విధానాన్ని సంస్కృతిని తెలుసుకోవడం అవసరమన్నారు. జాతీయ శిబిరాల్లో పాల్గొనడంతో సమాజం పట్ల గౌరవం, బాధ్యత పెరుగుతుందన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ ఎంబీ సురేష్, మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్‌ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కృష్ణారెడ్డి, వైవీయూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎన్.వెంకటరామిరెడ్డి నేతృత్వం వహించారు. వైవీయూ సమన్వయకర్త డాక్టర్ రామిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

టీడీపీ శాశ్వత సభ్యత్వం పొందిన కొండా రామక్రిష్ణారెడ్డి


రితీష్‌కుమార్‌రెడ్డితో శాశ్వత సభ్యత్వం తీసుకుంటున్న రామక్రిష్ణారెడ్డి

పోరుమామిళ్ల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): బద్వేలు నియోజకవర్గ సమన్వయకర్త రితీష్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో క్రిష్ణంపల్లె టీడీపీ నేత కొండా రామక్రిష్ణారెడ్డి టీడీపీకి రూ.లక్ష చెల్లించి శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. కమ్మవారిపల్లెకు చెందిన కలవకూరి నడిపి వెంకటసుబ్బయ్య, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ చెరుకూరి చెన్నరాయుడు, వెంగమాంబ హైస్కూలు డైరెక్టరు పత్తచి వెంగయ్య అల్లుడు వెంగమాంబ హైస్కూలు చైర్మన్ గుర్రం పుల్లప్పనాయుడు శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. మల్లికార్జునరెడ్డి, టీడీపీ నేతలు పాల్గొన్నారు,

బద్వేలులో క్షుద్రపూజల కలకలం


ముగ్గువేసిన ప్రాంతం

బద్వేలుటౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఐలమ్మకాలనీ నాలుగురోడ్ల కూడలిలో గురువారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు ముగ్గువేసి మంత్రించిన నిమ్మ కాయలు వేశారు. దీంతో కాలనీ మొత్తానికి క్షుద్రప్రయోగం జరిగిందంటూ కాలనీ వాసులంతా భయాందోళనలకు గురవుతున్నారు.

ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత పాటించాలి

జమ్మలమడుగు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): వాహనాల్లో వెళ్లేవారు, డ్రైవర్లు రోడ్డు భద్రత పాటించాలని జమ్మలమడుగు అర్బన్ సీఐ లింగప్ప సూచించారు. గురువారం ఆర్టీసీ డిపో ప్రాంగణంలో నిర్వహించిన రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో సీఐ డ్రైవర్లకు సూచనలు, సలహాలు ఇచ్చారు. డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్‌లో మాట్లాడరాదన్నారు. ప్రమాదాలు జరిగితే ఇబ్బందులు ఆయా కుటుంబాలవారికి నష్టం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ప్రవీణ్, ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ పెద్దిరాజు, ఏఎంఎఫ్ కంబగిరి స్వామి, డ్రైవర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్‌నేత జయరామయ్య మృతి



బద్వేలుటౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నేత, టింబర్ డిపో జయరామయ్య (75) అనారోగ్యంతో చెన్నై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడు జయరామయ్య పార్టీకి నమ్మదగ్గ వ్యక్తని, పార్టీ అభ్యున్నతికి కృషిచేశారన్నారు. ఈయన మృతికి పలువురు టీడీపీ నేతలు సంతాపం తెలిపారు.

ప్రజలపై విద్యుత్ భారం మోపడం సరికాదు


మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ నేత

బద్వేలు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రజలపై విద్యుత్ భారం మోపడం సరికాదని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని పేర్కొన్నారు. స్థానిక డీవైఎఫ్ఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలపై ట్రూ అప్, సర్దుబాటు చార్జీలు మోపడం సరికాదని అదానీతో చేసుకున్న సోలార్ విద్యుత్ ఒప్పందాలను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే స్మార్ట్ మీటర్లు తొలగించి, చార్జీలను తగ్గించాలని లేకపోతే ఆందోళనలు చేపడతామన్నారు. పట్టణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్ షరీఫ్, ఆదిల్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను బాగా చూసుకోవాలి

చాపాడు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్క విద్యార్థి తల్లిదండ్రులను బాగా చూసుకోవడమే జీవితానికి సార్థకత అని విశ్రాంత ఉపాధ్యాయులు సాంబశివారెడ్డి, సుశీల అన్నారు. చిన్నగురవలూరు గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2001-2002 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు సమ్మేళన నిర్వహించారు. నాటి విద్యార్థులు వారికి చదువులు బోధించిన విశ్రాంత ఉపాధ్యాయులు సాంబశివారెడ్డి, సుశీల, రఘురామయ్య, సుబ్బరాయుడు, వెంకటసుబ్బయ్య, మరో తొమ్మిది మందిని సన్మానించారు. ఆరోజు తరగతి గదుల్లో జరిగిన విషయాలను వారు నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా సుశీల మాట్లాడుతూ పిల్లలను బాగా చదివించుకుని ఉన్నత ఉద్యోగాలు సంపాదించుకోవాలన్నారు. సమాజానికి సేవ చేయడం తన కర్తవ్యమన్నారు.

మహాసభలు విజయవంతం చేయాలి

పోరుమామిళ్ల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఏఐటీయూసీ ఆటో కార్మికుల జిల్లా నాలుగో మహాసభలను విజయవంతం చేయాలని ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా నేత రవికుమార్ పిలుపునిచ్చారు. గురువారం పోరుమామిళ్ల ఆర్టీసీ బస్టాండులో ఆటో కార్మికులకు కరపత్రాలు పంపిణీ అనంతరం ఆయన మాట్లాడుతూ 21, 22 తేదీల్లో కడపలో జరిగే నాలుగో మహాసభలకు ప్రతి ఒక్క ఆటో కార్మికుడు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రవాణా రంగంలో ఉన్న లక్షలాది కార్మికులకు భద్రత కల్పించడంలో విఫలమయ్యారన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు వీరయ్య, సహాయ కార్యదర్శి కేశవ, చంద్ర, రామయ్య పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి


కార్మికులతో శుభ్రం చేయిస్తున్న ఎంపీడీఓ

ఖాజీపేట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ శుభ్రత పాటించాలని ఎంపీడీఓ దివిజ సంపతి అన్నారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ రోడ్డుకు ఇరువైపులా చెత్తాచెదారాలను వేసి అపరిశుభ్రంగా చేయకూడదని, పరిసరాలు శుభ్రంగా ఉంటేనే రోగాలు మన దరిదాపులకు రావన్నారు. కొందరు అపరిశుభ్రతకే ప్రాధాన్యత ఇస్తున్నారని, అలాంటివారిపై చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.

విశ్రాంత వైశ్యాబ్యాంకు మేనేజరుకు సన్మానం


సూరిబాబు దంపతులను సన్మానించిన బలిజ సంఘం నేతలు

పోరుమామిళ్ల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత వైశ్యా బ్యాంకు మేనేజరు యనమల సూరిబాబును బలిజ సంఘం నేతలు సన్మానించారు. ఇటీవల పోరుమామిళ్ల చెరువు కట్ట వద్ద జరిగిన బలిజ కులస్తుల వనభోజనానికి సహాయ సహకారాలు అందించారన్నారు. సర్పంచ్ యనమల సుధాకర్, రాయల్ సేవా సమితి నేతలు వెంకటేశ్వర్లు, నరేశ్, బాలచంద్ర పాల్గొన్నారు.

రెండు లారీలు ఢీ డ్రైవర్‌కు గాయాలు


చౌటిపల్లె వద్ద ఢీకొన్న లారీలు

కొండాపురం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): చౌటిపల్లె వద్ద లారీలు ఢీకొన్న సంఘటనలో లారీ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. మంగళవారం ఎదురెదురుగా రెండు లారీలు ఢీకొనడంతో అవి రోడ్డుపై నిలిచిపోయాయి. గురువారం ఉదయం ముద్దనూరు నుంచి తాడిపత్రి వైపు వెళతున్న మరో లారీ, ఆగి ఉన్న ఈ లారీలను ఢీకొంది. దీంతో లారీ డ్రైవర్ అనిల్‌కుమార్‌కు కాళ్లు విరిగినట్లు తెలుస్తోంది. ఇతన్ని చికిత్స నిమిత్తం తాడిపత్రికి తరలించారు.

ప్రత్యేక వికలాంగుల పెన్షన్లపై విచారణ



పోరుమామిళ్ల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మంచానికి, వీల్‌చైర్లకు పరిమితమై పింఛన్లు అందుకుంటున్న లబ్ధిదారులను కడప డాక్టర్ల బృందం విచారిస్తున్నారు. మండలంలో 14 మంది వీల్‌చైర్, మంచాలకు పరిమితమైన వారు రూ.15వేల పింఛన్లను అందుకుంటున్నారు. గురువారం వీరి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యబృందం విచారించారు. ఎంపీడీఓ రమణారెడ్డి పాల్గొన్నారు.

యాదవ సేవా సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణాలయం యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2025 క్యాలెండర్‌ను గురువారం కృష్ణాలయంలో ఆవిష్కరించారు. కృష్ణాలయం చైర్మన్ చల్లా రాజగోపాల్ యాదవ్ మాట్లాడుతూ కృష్ణాలయం యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో మొదటిసారి క్యాలెండర్‌ను రూపొందించామన్నారు. కార్యక్రమంలో కృష్ణాలయం కార్యదర్శి గండి ఆంజనేయులుయాదవ్, భాస్కర్‌యాదవ్, మల్లికార్జునయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

స్థలం విషయమై ఘర్షణ

ఇరువురికి గాయాలు

పోరుమామిళ్ల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): స్థల విషయమై కొందరు గొడవ పడగా ఇద్దరు తీవ్రగాయాల బారిన పడ్డారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నాగులకుంట్ల వాసులు బోవిళ్ల సతీష్‌కుమార్‌రెడ్డి అతని భార్యపై అదే గ్రామానికి చెందిన చిత్త రాజశేఖర రెడ్డి మరో ఆరుగురు వ్యక్తులు స్థల విషయమై గొడవ పడి రాళ్లతో కొట్టారు. దీంతో భార్యాభర్తలిద్దరికీ గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్సవ విగ్రహాల ఊరేగింపు

జమ్మలమడుగు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): దేవగుడి గ్రామంలో సంక్రాంతి పండుగ పురస్కరించుకుని గురువారం సీతారాముల ఉత్సవ విగ్రహాల ఊరేగింపు జరిగింది. విగ్రహాల వెంట గ్రామోత్సవంలో టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, గ్రామ నేతలు పాల్గొన్నారు. ఉత్సవంలో గ్రామంలోని ఇంటింటి వద్ద భక్తులు పూజలు చేసి మొక్కుకున్నారు.

దళిత కాలనీల్లో శ్మశానాలు ఏర్పాటు చేయాలి


శ్మశానాల కోసం నిర్వహిస్తున్న సర్వే

బద్వేలు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండల దళిత కాలనీల్లో శ్మశానాలు ఏర్పాటు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్ కోరారు. అబ్బుసాహెబ్ పేట, బయనపల్లె, రాజుపాళెం, గొడుగునూరు, ఉప్పత్తివారిపల్లె, కోనసముద్రం, కొత్తచెరువు తదితర గ్రామాల దళిత కాలనీల్లో శ్మశానాలు లేక ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మారినా ఇక్కడి పరిస్థితులు మారడం లేదని, శ్మశాన స్థలాలు కబ్జాదారులు ఆక్రమించుకున్నా సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారని, దీనిపై స్పందించి శ్మశాన స్థలాలను స్వాధీనం చేసుకుని చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేయాలని కోరారు. ఈయన వెంట పలువురు సంఘ సభ్యులు ఉన్నారు.

కోడిపందెం రాయుళ్ల అరెస్టు

లింగాల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కోడిపందెం స్థావరంపై దాడి చేసి 8 మంది కోడిపందెం రాయుళ్లను అరెస్టు చేశామని ఎస్ఐ మధుసూదన్‌రావు తెలిపారు. అంబకపల్లె ఘాట్ వద్ద కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు వారిపై దాడి చేసి తొమ్మిది కోళ్లను, రూ.8730 నగదును పట్టుకున్నామన్నారు. పట్టుబడిన వారు పులివెందుల, నల్లపురెడ్డిపల్లె గ్రామాలకు చెందిన వారని ఆయన వివరించారు.

విధులను అడ్డుకున్న ఇద్దరు అరెస్టు

వేంపల్లె, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): వీధిలో ఎస్ఐ రంగారావు, పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన మల్లికార్జున, శివను అరెస్టు చేసినట్లు సీఐ సురేష్‌రెడ్డి తెలిపారు. గౌరీ భర్త మల్లికార్జున వేధిస్తున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేయగా వడ్డె వీధిలోకి వెళ్లిన పోలీసులకు ఎదురుతిరిగి విధులకు ఆటంకం కలిగించారు. దీంతో వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారని సీఐ వివరించారు.